రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ఘన వీడ్కోలు

తిరుపతి నుండి ప్రయాణించిన వందే భారత్ ఎక్స్ప్రెస్‌లో సిఎస్

విశాలాంధ్ర-తిరుపతి: రెండు రోజుల పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డికి తిరుపతి రైల్వే స్టేషన్ లో ఘన వీడ్కోలు లభించింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గౌరవ ప్రధానమంత్రి నిన్న ప్రారంభించడం జరిగిందని నేడు మొదటిసారిగా తిరుపతి నుండి వందే భారత్ ప్రయాణిస్తుండడంతో నేడు 11 గంటలకు విమానాశ్రయం నుండి వెళ్లవలసి ఉండగా ప్రయాణాన్ని రద్దు చేసుకుని వందే భారత్ రైలులో ప్రయాణించడం జరుగుతున్నదని అన్నారు. తిరుపతి జిల్లాలో టిటిడి అభివృద్ధి పనులకు సంబంధించి పలు పర్యటనలు పూర్తిచేసుకుని నేటి మధ్యాహ్నం తిరుపతి రైల్వే స్టేషన్ కు చేరుకొని సిఎస్ గుంటూరు వరకు ప్రయాణించి అక్కడ నుండి విజయవాడ చేరుకోనున్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ , జేఈవోలు సదా భార్గవి, వీర బ్రహ్మయ్య, నగరపాలక కమిషనర్ హరిత, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వీడ్కోలు తెలిపిన వారిలో ఉన్నారు

తిరుచానూరు అమ్మవారి సేవలో ఆర్థిక మంత్రి బుగ్గన

విశాలాంధ్ర-తిరుచానూరు : ఆదివారం ఉదయం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ తో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తిరుచానూరుపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ పద్మావతి అమ్మవారిని ప్రత్యేక దర్శనం చేయించిన ఆలయ అధికారులు ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్

విశాలాంధ్ర-తిరుచానూరు: ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థ సారథి శ్రీ పద్మావతి అమ్మవారి కళ్యాణోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం. అమ్మవారిని అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ సిబ్బంది వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దాం

విశాలాంధ్ర-తిరుపతి: భారత కమ్యునిస్ట్ పార్టీ అగ్ర నాయకుడు చంద్ర రాజేశ్వరరావు గారి 29వ వర్ధంతి తిరుపతి సిపిఐ పార్టీ ఆఫీసులో జల్లా విశ్వనాథ్ గారి అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు , చంద్ర రాజేశ్వరరావు గారు పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టు ఉద్యమ అగ్ర నాయకులలో చంద్ర రాజేశ్వరరావు గారు ఆంధ్రాలోని కృష్ణాజిల్లా , చల్లపల్లికి దగ్గరగా వున్న మంగళాపురం గ్రామం వీరి పుట్టిన ప్రాంతం అని పేదలకు సాగుభూముల సాధన కోసం చిన్న వయసులోనే చల్లపల్లి రాజాకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించారని అన్నారు. రాజేశ్వరరావు తన వీలునామాలో కూడా కమ్యూనిస్టు ఉన్నత విలువలు, సంప్రదాయాలు అంటే ఏమిటో చూపారు ఈ తరం నాయకులకు ఆదర్శం అని తెలపారు.ఇంతటి ఆదర్శవంతమైన వీలునామా వేరొకరికి వుందో లేదో తెలియదు, ఉంటే ప్రజల స్ఫూర్తికోసం తెలియ పరచవలసిన అవసరం వుంది అన్నారు .ప్రజా ఉద్యమకారుడుగా, ఆందోళన కారుడుగా, పోరాట యోధుడిగా, నిర్మాణదక్షుడిగా, నిబద్ధత- నమ్మిన సిద్ధాంతం పట్ల అంకిత స్వభావం కలిగిన వాడిగా చంద్ర రాజేశ్వరరావు గారు దేశ చరిత్ర లో నిలిచి పోయారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాధాకృష్ణ ,శివ ,పద్మనాభరెడ్డి ,రాజా ,రామకృష్ణ, రామచంద్రయ్య, నాగరాజు ,బాబు ,చలపతి ,నాగభూషణం ,శ్రీను ,ప్రమీల ,విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోడీని గద్దింపండి- దేశాన్ని కాపాడండి

సిపిఐ సిపిఎం పాదయాత్రలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సమితి సమావేశం ఆదివారం వరదయ్యపాలెం మండల కేంద్రంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంభాకం చిన్ని రాజ్ ఆధ్వర్యంలో జరిగింది ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కే కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మోడీ హటావో దేశ్ కో బచావో అనే నినాదంతో ఏప్రిల్ 14 నుండి 30వ తేదీ వరకు సిపిఐ సిపిఎం పార్టీలు పాదయాత్రల ద్వారా ప్రచార సమరభేరి జరుపుతున్నాయని తెలిపారు. కేంద్రంలో మోడీ నాయకత్వం లో ఉన్న ప్రభుత్వం కార్పొరేట్ శతకోటేశ్వర్లు లకు కొమ్ముగాస్తు దేశ సంపదను వారికి దోచి పెడుతున్నదని దేశ భవిష్యత్తును దేశ ప్రజలను అంధకారంలోకి నిడుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ఎన్నికల్లో చెప్పిన వాగ్దానాలు అయినా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు నల్ల డబ్బు వెలికి తీయడం ప్రతి పౌరుని ఖాతా లో15000 జమ చేయడం లాంటి వాగ్దానాలు చేసి గద్దెనెక్కారని వాగ్దానాలను ప్రజలను మరచి శత కోటేశ్వరులకు ఊడిగం చేయడంలో మునిగి తేలుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు మోడీ 9 సంవత్సరాల పాలనలో జీఎస్టీ ద్వారా 40 లక్షల రూపాయలను దేశ ప్రజల దగ్గర నుండి వసూలు చేశారని దేశ ప్రజల కోసం ఎలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదని తీవ్రంగా విమర్శించారు దేశంలోని శతకోటీశ్వర్లు కు 600 లక్షల రూపాయలను మోడీ హయాంలో రద్దు చేశారని దేశ ప్రజల సంపదను కార్పొరేటర్లకు చౌకగా అమ్ముతున్నారని విమాన నిలయాలు వాడరేవులు క్రీడా మైదానాలు రైల్వే స్టేషన్లో బొగ్గు గనులు విద్యుత్ ఉత్పత్తి స్టేషన్లో ఎల్ఐసి లాంటి ప్రభుత్వ సంస్థలు ఆ జాబితాలో ఉన్నాయని ఇది దేశానికి రాబోయే కాలంలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మోడీ హటావో దేశ్కో బచావో అని నినాదంతో జరుగుతున్న ఈ ఉద్యమానికి ప్రజలందరూ ఆలోచించి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా చిన్ని రాజు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతాలను కులాలను ప్రాంతాలను విడగొడుతూ దేశ సమగ్రతకు ఐక్యతకు విఘాతం కలిగే విధంగా వ్యవహరిస్తుందని దేశ సార్వభౌమధికారానికి ప్రజాస్వామ్యానికి తిలోదాకలిస్తూ రాష్ట్రాల హక్కులను హరిస్తుందని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులో లేవని అయితే వాటిని పండించే రైతుకు కనీస మద్దతు ధర లేదని ఆయన విమర్శించారు. ప్రజ కార్మిక రైతాంగ వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని మోడీది గద్దె దించాలని దేశాన్ని రక్షించాలని ప్రజలందరూ శపథం పునాలని ఆయన కోరారు ఈ సమావేశానికి పిచ్చాటూరు సిపిఐ మండల కార్యదర్శి ఎం విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ నాయకులు చంద్రబాబు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కత్తి ధర్మయ్య యువజన విద్యార్థి సంఘ నాయకులు తరుణ్ కుమార్ చంద్ర నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట గాండ్ల సంఘ అధ్యక్షుడుగా చిరివెళ్ల ముని హేమంత్ ఎన్నిక

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట రిటైర్డ్ ఉద్యోగుల భవనం నందు తిరుపతి జిల్లా గాంఢ్ల,తెలికుల సంక్షేమసంఘం అధ్యక్షులు నెల్లూరు పల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయుడుపేట గాంఢ్ల సంఘం కి చెందిన కుటుంబ సభ్యులు ఈసమావేశంలో పాల్గొన్నారు. సమావేశానంతరం నాగరాజు పర్యవేక్షణలో నాయుడుపేట మండల గాండ్ల సంఘ అధ్యక్షుడిగా చిరివెళ్ల ముని హేమంత్, ప్రధాన కార్యదర్శిగా బద్రి సురేష్, ఉపాధ్యక్షులుగా చిరువెల్ల యగ్నేష్, కోశాధికారిగా చెంగయ్య, సంయుక్త కార్యదర్శిగా చెందేటి రామ్మూర్తి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని నాయుడుపేట గాండ్ల కులస్తులు పూలమాలలతో, శాలువాలతో సత్కరించారు. కుల అభివృద్ధికి పాటుపడాలని నూతన కార్యవర్గ సభ్యులకు కోరారు.

ఎస్‌పిఎల్సీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ఎస్‌పిఎల్సీ చర్చిలో ఈస్టర్ సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక గీతాలను ఆలపించారు. బైబిల్ పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందించారు. పాస్టర్ ప్రశాంత్ కుమార్ ఈస్టర్ విశిష్టతను వివరించారు. చర్చి వద్ద యాచకులకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.

డిసెంబర్ నాటికి చిన్నపిల్లల

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు అందుబాటులోకి తేవాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: టీటీడీ నిర్మిస్తున్న చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని డిసెంబర్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి అధికారులకు సూచించారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం ఇతర అధికారులతో కలిసి ఆదివారం ఆయన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకుముందు టీటీడీ గోశాలలోని ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, అగర బత్తీల తయారీ రెండవ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ, ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణం వల్ల గోశాలలోని గోమాతలు, ఇతర పశువులకు బలవర్ధకమైన సమగ్ర దాణా అందించే అవకాశం కలిగిందన్నారు. తద్వారా పాల ఉత్పత్తి పెరగడంతో పాటు, పాలలో ప్రోటీన్ శాతం కూడా గణనీయంగా వృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. టీటీడీ ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో తయారు చేస్తున్న అగర బత్తీలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా టీటీడీ రెండవ యూనిట్ ను ప్రారంభించడాన్ని ఆయన అభినందించారు. శ్రీ పద్మావతి హృదయాలయం లో 1300 కు పైగా చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఈ ఆస్పత్రిలో ఇటీవల రెండు గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డాక్టర్ జవహర్ రెడ్డి శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, స్విమ్స్ క్యాన్సర్ ఆస్పత్రి, తిరుమలలో అంజనాద్రి అభివృద్ధిపై సమీక్ష జరిపారు. అలాగే తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ బృందావనం పనులు, శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ప్రగతి, ఉద్యోగులకు ఇళ్ల స్థలాల పంపిణీ, ఈహెచ్ ఎస్ ట్రస్ట్, బర్డ్ ఆస్పత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్, గ్రహణ మొర్రి సర్జరీలు నిర్వహిస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ విద్యా సంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పైచర్చించారు. తిరుపతిలోని అన్ని కాలేజీల హాస్టళ్లకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసే అంశంపై సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో రైతు సాధికార సంస్థ సిఈవో విజయ కుమార్, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజి, టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, శ్రీ పద్మావతి హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకా ధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, పశు వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రవి, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరినాథ రెడ్డి, గో సంరక్షణ ట్రస్ట్ సభ్యుడు రామ సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

స్విమ్స్ మరియు శ్రీ పద్మావతి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో

హాండ్స్ ఆన్ వాస్కులర్ అనాస్తోమోసిస్ వర్కుషాప్

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ సి.టి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్. బి. వెంగమ్మ, సిటీ సర్జరీ విభాగాధిపతి మరియు ఆర్గనైసింగ్ చైర్మన్ డాక్టర్. వినోద్ భాను, జనరల్ సర్జరీ విభాగాదిపతి డాక్టర్. ముక్తేశ్వరయ్య, అనాటమీ విభాగాధిపతి డాక్టర్. శ్రీకాంత్,డాక్టర్ వాసుదేవరెడ్డి, డాక్టర్. శ్రీహరి రావు, ఆర్గనైసింగ్ సెక్రటరీ డాక్టర్. సత్యవతి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్. బి.వెంగమ్మ మాట్లాడుతూ వాస్కులర్ అనస్టోమోసిస్ అనేది రెండు రక్త నాళాలు ఒకదానికొకటి అనుసంధానించబడి లేదా పునరుద్ధరించబడిన శస్త్రచికిత్సా ప్రక్రియ ఇది నిరోధించబడిన లేదా దెబ్బతిన్న నాళంలో రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడానికి, రక్త నాళాలకు గాయాలను సరిచేయడానికి లేదా రెండు నాళాల మధ్య బైపాస్‌ను రూపొందించడానికి నిర్వహిస్తారు. ప్రక్రియ సమయంలో, సర్జన్ జాగ్రత్తగా కుట్లు, స్టేపుల్స్ లేదా ఇతర పదార్థాలను ఉపయోగించి రెండు నాళాలను కలుపుతారు. మరియు కనెక్షన్ ఎటువంటి లీక్‌లు లేకుండా సురక్షితంగా ఉండేలా చూస్తారు. ఈ ప్రక్రియ సాధారణంగా కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్, హీమోడయాలసిస్ కోసం వాస్కులర్ యాక్సెస్ మరియు అవయవ మార్పిడి వంటి వాస్కులర్ సర్జరీలలో ఉపయోగించ బడుతుంది. ప్రక్రియ యొక్క విజయం సర్జన్ యొక్క నైపుణ్యం మరియు అనుభవం, రోగి యొక్క ఆరోగ్యం మరియు నాళాలను కనెక్ట్ చేయడానికి ఉపయోగించే పదార్థాల నాణ్యతపై ఆధారపడి ఉంటుంది అని తెలియ చేశారు.

చెన్నేరీలో కాలవ పోరంబోకు స్థలంలో లేఅవుట్ల దారి ఏర్పాటు

చోద్యం చూస్తున్న సత్యవేడు రెవెన్యూ శాఖ అధికారులు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు మండలంలో విలువైన ప్రభుత్వ భూములు ఎక్కడపడితే అక్కడ అన్యాక్రాంతమవుతున్నాయి.జానెడు ప్రభుత్వ స్థలం ఖాళీ స్థలం కనిపిస్తే చాలు భూబకాసురులు అందులో పాగా వేయడం సర్వ సాధారణంగా మారిపోయింది.కేవలం ప్రభుత్వ స్థలమే గాక డీకేటీ,కాలవపోరంబోకులు,చెరువు పోరంబోకుల సైతం కబ్జా బారిన పడుతున్నాయి.ఇందుకు చెన్నేరీ పెద్దగుంటకు సమీపంలో కాలవ పోరంబోకు భూమి ఆక్రమనే నిదర్శనంగా నిలుస్తోంది.చెన్నేరీ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 194 లో 0.20 సెంట్లు కాలవ పోరంబోకు భూమి ఉన్నట్టు రెవిన్యూ రికార్డులు సూచిస్తున్నాయి. వర్షాలు పడ్డప్పుడు అడవులలో పడ్డ వర్షపు నీరు ఈ వంక కాలం ద్వారా పెద్దగుంటకు వెళు ందని స్థానికులు పలువురు పేర్కొన్నారు.అయితే కాలవ పోరంబోకు స్థలం అనుకొని పుత్తూరుకు చెందిన ఓబడా భూస్వామి కొంత పట్టా భూమిని లేఅవుట్ల నిర్మాణం కోసం ఇటీవల కొనుగోలు చేసినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో పట్టా భూములోకి ప్రవేశానికి తగిన దారి ఏర్పాటు చేసుకోవడానికి బడా భూస్వామికి కాలవ పోరంబోకు స్థలం పై కన్ను పడింది.ఈ క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కాలవ పోరంబోకు స్థలాన్ని కూడా ఆక్రమించుకొని పట్టా భూమిలో కలిపేసుకున్నారు.పైగా లేఅవుట్ల కోసం కాలవ పోరంబోకు స్థలంలో దారి ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ప్రధానంగా సత్యవేడు టూ ఊతుకోట ప్రధాన మార్గంలో చెన్నేరి వద్ద రోడ్డుకు ఆనుకొని కాలవ పోరంబోకు స్థలం దాదాపు 20 సెంట్లు ఉంది.కాలువ పోరంబోకు స్థలం విలువ ప్రస్తుతం 50 లక్షల రూపాయల వరకు ఉన్నట్లు గ్రామస్తులు పలువురు చెబుతున్నారు.గతంలోనూ కాలువ పోరంబోకు స్థలాన్ని ఇండ్ల నిర్మాణానికి కొందరు ఆక్రమించుకున్న అప్పటి తహసిల్దారు శ్రీదేవి దీనిపై వెంటనే స్పందించారు.కాలవ పోరంబోకు స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది.అయితే ప్రస్తుతం స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గుట్టు చప్పుడు కాకుండా హెచ్చరిక బోర్డులను తొలగించి కాల్వను ఆక్రమించుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విలువైన కాలవ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొని యదేచ్ఛగా లేవట్ల నిర్మాణానికి దారి ఏర్పాటు చేసుకున్న సంబంధిత రెవిన్యూ అధికారులు దీనిపై ప్రేక్షక పాత్ర వహించడం విమర్శలకు దారి చూస్తోంది.కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొని పట్టా భూములు కలిపేసుకున్న,లేఅవుట్ల నిర్మాణానికి దారి ఏర్పాటు చేసుకున్న సంబంధిత సత్యవేడు రెవిన్యూ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవడంలో నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది.ఇంత జరుగుతున్న క్షేత్రస్థాయిలో సంబంధిత విఆర్వో శేఖర్ చోద్యం చూడడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులే కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి.కాసుల కోసం కక్కుర్తి పడి సంబంధిత రెవిన్యూ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కు అయ్యారేమోనన్న ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి.ఇప్పటికే రెవెన్యూ అధికారుల లాలూచీ వల్ల మండలంలో పలుచోట్ల విలువైన ప్రభుత్వ భూములు భూ బకాసురల గుప్పెట్లో ఉన్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా రెవెన్యూ అధికారులు దీనిపై స్పందించి చెన్నేరీలో ఆక్రమణకు గురైన కాలువ పోరంబోకు స్థలాన్ని కబ్జా నుండి విముక్తి కలిగించడానికి తగు చర్యలు తీసుకొని వరద ముప్పు నుంచి ఈ ప్రాంతాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

సీపీఐ, సీపీఎం నాయకుల పిలుపు

విశాలాంధ్ర - గూడూరు : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనపై ఏప్రిల్ 14 నుండి 31 వరకు నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం గూడూరు నియోజకవర్గ కార్యదర్శులు జీ. శశి కుమార్, జోగి శివ కుమార్ కోరారు. ఆదివారం గూడూరు పట్టణంలోని మాయాబజార్ లో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు సంసిద్ధం కావాలన్నారు. బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలను చట్టాలుగా తీసుకురావడానికి వామపక్షాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ నెల 14 నుండి మార్చి 31 వరకు నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. ఆర్థిక విధానాలు, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటికరణ, జీఎస్టీతో భారాలు, మతోన్మాదం, పౌరసత్వం, ఢిల్లీలో దాడులు, మత మార్పిడిలు, మైనార్టీ పై దాడులు, దళితులపై దాడులు, అవినీతి రఫెల్ ఆదాని కుంభకోణం. తదితర అంశాలపై బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పోలవరం నిర్వాసితులకు నిధులు ఇవ్వకపోవడం, ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, పెంచడంతోపాటు పార్లమెంటులో వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ చట్టం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణం, వంటి పరిశ్రమలకు నిధులు ఇవ్వకపోవడం తదితర అంశాలపై ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అదానీ కంపెనీలకు రాష్ట్ర వనరులు, సంపద, పరిశ్రమలన్నీ కూడా కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పూర్తిగా రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కాలేషా బాయ్, రమేష్, చంద్రయ్య , సీపీఎం నాయకులు, రమణయ్య ప్రసాద్, ముత్యాలయ్య, సురేష్, గోపి పాల్గొన్నారు.

వృద్ధులకు ఫల సరుకుల పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటి హాల్ ఆడిటోరియంలో ఆదివారం రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో రోటరీ చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు నిత్యవసర సరుకులు క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో రోటరీ చేయూత కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా 9వ తేదీన సరుకులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, రామ్మోహన్ రావు, చంద్ర, విజయ్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు రోటరీ విశిష్ట సేవలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రెండో పట్టణ పరిధిలోని బాలసదన్ లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన వాటర్ ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ ను క్లబ్ సభ్యులు దాత శ్రీనివాసాచారి ప్రారంభించారు. అనంతరం ఫుడ్ చాయిస్ కార్యక్రమంలో చిన్నారులకు వారు కోరిన ఆహార పదార్థాలను అందించారు. క్లబ్ సీనియర్ సభ్యులు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సమాజంలో పేదవారికి సహాయం అందించేందుకు ముందుంటుందన్నారు. విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చి అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్లు కొణిదల మునిగిరీష్, మయూరి శ్యామ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, రవికుమార్, జిజి. నాయుడు, రాంప్రసాద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమాన్ని చూసి జగనన్నను ఆశీర్వదించండి

విశాలాంధ్ర-దొరవారిసత్రం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ప్రజలంతా సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని నాయుడుపేట మాజీ ఏఎంసి డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కెలివేటి సంజీవయ్య సూచనలు మేరకు నాయుడుపేట మండలంలోని జువ్వలపాలెం సచివాలయ పరిధిలో మాజీ ఏఎంసి డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్థానిక వైసిపి నాయకులు నాగిరెడ్డి కుమార్ రెడ్డి, గోవా మాధవయ్య, వెంకటరమణయ్య లతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి గడపకు వెళ్లి తమ ప్రభుత్వం చేపట్టి,అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ,వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించి,సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు.పథకాలందని వారు వివరాలు తెలియజేస్తే వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు తదితరులు

టిటిడికి బంగారు చీరల బహూకరణ

విశాలాంధ్ర-తిరుపతి: తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లకు చెందిన శ్రీ నల్ల విజయ్ ఆదివారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీరలను బహూకరించారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి చేతుల మీదుగా వీటిని అందించారు. స్వామి వారికి రూ 45 వేల విలువ చేసే బంగారు చీరను అగ్గిపెట్టెలో పట్టేలా ఆయన తయారు చేయించారు. అలాగే శ్రీ పద్మావతి అమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టేలా 5 గ్రాముల బంగారంతో జరీ చీర తయారు చేశారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తికి చెందిన జలగం ప్రభాకర రావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి జలగం సుభాషిణి ఆదివారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెంకటపతి నగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం వేంకటపతి నగర్ పంచాయితీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సర్పంచ్ చిన్ని యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సిఎం జగన్మోహన్ రెడ్డి ఫోటో ఉన్న స్టిక్కర్ లను అంటించారు.జగన్ చేసిన అభివృద్ధిని గ్రామస్తులకు తెలియజేసారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు విడుదల మాధవ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి, ఉపేంద్రరెడ్డి, మూలం చంద్రమోహన్ రెడ్డి,నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇండ్లకు వలంటీర్లతో నాయకులు

విశాలాంధ్ర-చిల్లకూరు: పేదవాని ఇంటి గడపకు వలంటీర్లతో , వైఎస్సార్సీపీ నాయకులు వెళ్లి వారికి, జగన్ మా నమ్మకం, జగన్ తోనే మా భవిష్యత్తు అని వారికి వివరిస్తూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024 ఎన్నికల లో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. బూదనం గ్రామంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు కనపర్తి దిలీప్ రెడ్డి, ఇంటి ఇంటికి వెళ్ళి గత నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి తిరిగి జగన్మోహన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని, గెలిపించాలని కోరారు.

ప్రజా సమస్యలను గుర్తించండి-వలంటీర్లకు జడ్పీటీసీ సూచన

విశాలాంధ్ర-చిల్లకూరు: బూదనం గ్రామ వలంటీర్లతో జడ్పీటీసీ మన్నెం శీనయ్య ఆదివారం సమావేశం అయ్యారు. జగన్ అన్న మా నమ్మకం, జగన్మోహన్ రెడ్డితో నే మా భవిష్యత్తు కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి ఆ కుటుంభం లోని వారిని కలిసి నప్పుడు, కొందరు సమస్యలు పరిష్కరించాలని కోరితే వాటిని పుస్తకం లో రాసుకుని, సచివాలయం కన్వీనర్ లకు చెప్పాలని సూచించారు. సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పినా వాటిని రికార్డ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన ప్రభుత్వం ద్వారా చేయాల్సిన పనులు ఉంటే వాటిని గుర్తించాలన్నారు. సచివాలయాల కన్వీనర్ వెదనపర్తి మనోజ్ కుమార్ రెడ్డి, గ్రామ నాయకులు, ఉప సర్పంచ్ కనపర్తి దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటి, రామచంద్రాపురం, దక్కిలి, బాలాయపల్లి, డి.వి.సత్రం, నారాయణవనం, వడమాలపేట, నగరి, పెనుమూరు, ఎస్.ఆర్.పురం, పూతలపట్టు, తవణంపల్లి, యాదమరి, చిత్తూరు రూరల్, సదుం, సోమల, శాంతిపురం
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 94909 52134

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

మా జీవితాలు బాగుండాలంటే మళ్లీ నువ్వే రావాలి జగనన్న

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని ఒకటవ వార్డు మంగళం కాలనీ నందు వార్డు కౌన్సిలర్ జేఎన్సి నరసింహులు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం కార్యక్రమాన్ని ఆదివారం రోజున నిర్వహించడం జరిగింది కౌన్సిలర్ జేఎన్సి నరసింహులు ఇంటింటా తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వంపై మీ అభిప్రాయాలు తెలియజేయాలని ప్రజలను కోరడం జరిగింది. ప్రజా అభిప్రాయం మేరకు ఇంటింటా స్టిక్కర్లను అతికిస్తూ ప్రజా మద్దతును నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ మా జీవితాలు బాగుండాలంటే మళ్లీ జగనన్న రావాలని ఇంటింటా ప్రజలు మద్దతు తెలపడం జరిగిందని పేర్కొనడం జరిగింది. ప్రజా సంక్షేమమే పరమ వ్యాధిగా భావించి కులమతాలకు అతీతంగా పార్టీలు కచ్చితంగా వాలంటీర్ వ్యవస్థ సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా మా ప్రభుత్వం పాలన అందిస్తున్నదని తద్వారా ఇంటింటా కార్యక్రమంలో ప్రజలు పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని గెలిపించడానికి వార్డు నందు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు, ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్ యునుస్ నాయకులు గోవర్ధన సుబ్రహ్మణ్యం నవీన్ నాగ అమర తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: కల్లూరు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్ రామారాజ ఆర్ట్స్ అన్నారు. కాణిపాకం లో ఆదివారం జిల్లా లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ కోశాధికారి గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ కల్లూరు లయన్స్ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు అశ్వత్ నారాయణ మాట్లాడుతూ కల్లూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోకల తాతయ్య సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు చంద్రారెడ్డి, డాక్టర్ శివ ,మహమ్మద్ అలీ, రాజేంద్ర భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం కార్యక్రమం

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని ఏడవ వార్డులో జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ హలీం భాష ఆధ్వర్యంలో ఆదివారం రోజున జోరుగా సాగింది ఇంటింటా చైర్మన్ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా అందిస్తున్న సంక్షేమ ఫలితాలను వివరించి దాదాపు ఒక్కొక్క లబ్ధిదారునికి ఐదు నుండి ఆరు లక్షల వరకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమాన్ని వివరించడం జరిగింది. అదేవిధంగా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వార్డులో జరుగుతున్న అభివృద్ధిని వివరించడం జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష మాట్లాడుతూ %శ్రీ% కౌన్సిల్ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు పట్టణంలోని అన్ని వార్డులలో దాదాపు 100 కోట్ల రూపాయలతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు అంతేకాక పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా డివైడర్ తో కూడిన రోడ్డు విస్తరణకు 50 కోట్లు నిధులు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సమకూర్చడం జరిగిందని త్రాగునీరు సాగునీరు అందించే దిశగా రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు అంతేగాక పట్టణ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడం కోసం రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహాయ సహకారాలతో దాదాపు 20 కోట్ల రూపాయలు నిధులు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజా రవాణా వ్యవస్థ లో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా ఆర్టీవో కార్యాలయం కూడా ప్రజలకు అందుబాటులో పట్టణంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఎప్పటికప్పుడు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రి ఎంపీకి ప్రజలంతా అండగా ఉండాలని కోరుచున్నామన్నారు ఇంటింటా తిరుగుతుండగా ప్రజల నుండి విశేషా స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు గృహ సారుదులు వాలంటీర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా- తృట్టిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-కార్వేటినగరం: టిప్పటి బోల్తా పడిన సంఘటన మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని చిన్నకనుమ మలుపు వద్ద శనివారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... పచ్చికా పల్ల నుంచి కార్వేటినగరం వైపు ముగ్గుపిండి లోడ్డుతో వస్తున్న టిప్పర్ చిన్నకనుమ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్కు గాయాలయ్యాయి. పచ్చికా పల్లం నుంచి కార్వేటినగరం వైపుగా వచ్చే టిప్పర్లు ఎక్కువ బరువును తీసుకు రావడంతో చిన్నకనుమ వద్ద డ్రైవర్లు వాహనాన్ని అదుపు చేయ లేక వారానికి రెండు, మూడు సార్లు ప్రమాదానికి గురౌతుంటాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పెద్దకను, చిన్న కనుమల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే టిప్పర్ల వేయానికి కళ్యం వేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

టిడిపి గెలుపుకు సమన్వయంతో కృషి చేయాలి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:- రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు సమన్వయంతో కృషి చేయాలని పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రా రెడ్డి అన్నారు .పులిచెర్ల మండలం పాతపేట , బోడి రెడ్డి గారిపల్లె, వెంకట దాసరిపల్లి పంచాయతీ పరిధిలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పలు గ్రామాలలో టిడిపి జెండా ఆవిష్కరించారు. చల్లా రామచంద్రారెడ్డికి హారతులతో స్వాగతం పలికారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ ,టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శులు ధనుంజయ నాయుడు, సుబ్బారెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, ఉపాధ్యక్షులుఇనాయ్ తుల్లా ,కార్యదర్శి బండ్ల రమేష్ టిడిపి స్పోక్స్ పర్సన్ అన్సర్ భాష,నాయకులు కుమార్ రెడ్డి, మురళి నాయుడు,మోహన్ దాస్, భాస్కర, నజీర్, కడియాలసుబ్రహ్మణ్యం, నూరుల్లా, మల్లెల సురేష్ , పూల రమేష్ ,ఖాదరవల్లి,గురు ప్రసాద్, రామకృష్ణ ,యర్రయ్య,మునికృష్ణ, హరికృష్ణ, రవికుమార్ నాయుడు ,శేషాద్రి నాయుడు, తులసి, గోపి నాయుడు, చంగల్ రాయలు, గురుమూర్తి ,శంకర్, రెడ్డప్ప నాయుడు ,త్యాగరాజ, రామ్మూర్తి,మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సహృదయ ఓల్డ్ ఏజ్ హెూమ్‌లో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ఐరాల: ఐరాల మండలం పొలకల పంచాయతీ తాళంబేడువారి పల్లి లోని సహృదయ ఓల్డ్ ఏజ్ హెూం నందు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు ఐరాల మండలం అల్లు అర్జున్ ఫ్యాన్స్ యూత్ ఐకాన్ సాయికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఓల్డ్ ఏజ్ హెూమ్ లో ఉన్నటువంటి 30 మంది కి భోజనాలు, పండ్లు, స్వీట్లు పంచిపెట్టడం జరిగింది. తర్వాత అల్లు అర్జున్ జన్మదినం పురస్కరించుకుని ఓల్డ్ ఏజ్ హెూమ్ లో కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఓల్డ్ ఏజ్ హెూమ్ నిర్వాహకులు సుమతి అల్లు అర్జున్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అల్లు అర్జున్ పుట్టినరోజు వేడుకలు అంత ఘనంగా నిర్వహించిన సాయి కుమార్ ని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వినోద్, హేమంత్, వంశి, దాము, నవీన్, ప్రవీణ్, సతీష్, శ్రీనివాస్, రాకేష్, రోహిత్, మనోజ్, మరియు కలికిరిపల్లి యువత పాల్గొన్నారు.

నష్టాల్లో వెదురుకుప్పం బిఎంసీయూ

విధినిర్వణ మేనేజర్ విధులకు గైర్హాజరు - ప్రభుత్వ లక్ష్యం గాలికి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పాడిరైతులను ఆదుకోవడం,డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా పాలశీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పాల రైతుల నుంచి కొన్ని ప్రయివేటు డైరీలు మధ్యవర్తుల ద్వారా పాల సేకరణ చేసి మద్దతుధర ఇవ్వకుండా మోసాలకు పాల్పడేవారు.ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం డిఆర్డీఏ ఆధ్వర్యంలో మండల సమాఖ్య ద్వారా గ్రామాల్లో పాలు సేకరించి మండలం లోని బిఎంసీయూ లకు తరలించి కూలింగ్ చేసి శ్రీజ డైరీకి పంపుతున్నారు. దీంతో పాలరైతులను వారి పాల నాణ్యత బట్టి గిట్టుబాటు కల్పిస్తున్నారు. పాలసీతలీకరణ చేసి పంపిన మండల సమాఖ్య కు లీటరుకు సుమారు 2 రూపాయిలు కమీషన్ చెల్లిస్తారు.ఈ ఆదాయం మండల వెలుగు సమాఖ్య అభివృద్ధికి కేటాయిస్తారు.

అసలేం జరిగిందంటే

వెదురుకుప్పం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం చే ఏర్పాటు చేసిన పాలసీతలీకరణ కేంద్రం అక్టోబర్ 2 వతేదీ 2021 న ప్రారంభించారు.అంటే సుమారు 17 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నష్టాల్లోనే కొనసాగుతోందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఇప్పటికీ సుమారు 73000 రూపాయిలు నష్టాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. బిఎంసీయూ పర్యవేక్షణకు,గ్రామాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించి పాల సేకరణ పెంచి ఆదాయం పెంపు చెయ్యడానికి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపియం)కు బాధ్యతలు అప్పగించారు. అయితే విధి నిర్వహణలో ఉండాల్సిన ఆ అధికారి నెలల తరబడి విధులకు డుమ్మా కొట్టారని ప్రచారం లో ఉంది.దీంతో వరుసగా నష్టాల్లో కొనసాగుతోందని మండల సమాఖ్య లో కోడై కూస్తోంది.బిఎంసీయూ ద్వారా ఆదాయం పెంచుకుని మహిళల ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడాలనే లక్ష్యం నీరుగారుతోన్న పరిస్థితి.పాలశీతలీకరణ యంత్రాల కెపాసిటీ బట్టి పాలసేకరణ చేయకపోవడం వల్ల ఆదాయం సాధ్యపడలేదని విమర్శలు ఉన్నాయి. అక్కడ పనిచేసే సిబ్బందికి వేతనాలు,కరెంట్ బిల్లులు, డీజిల్, మరమ్మతులు వీటికి కూడా ఆదాయం చాలక మండల సమాఖ్య లోనుంచి ఖర్చులు చేస్తూ నష్టాలు చూపిస్తున్నారు.ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయం తో ప్రవేశపెట్టిన వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి అభాసుపాలు అవుతుందనడానికి వెదురుకుప్పం బిఎంసీయూ ఒక ఉదాహరణ.ప్రభుత్వ లక్ష్యానికి తిలోదకాలిచ్చి నెలల తరబడి విధులకు డుమ్మా కొట్టి బిఎంసీయూ నష్టాలుపాలు చేసిన సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి ఆదాయమార్గంలో నడిపించే చర్యలు ఉన్నతాధికారులు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మద్యం, మత్తు పదార్థాలతో యువత జీవితాలను నాశనం చేస్తున్న నేతలు

- బోడే రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర-పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గం లో నిరుద్యోగ సమస్య అధికంగా ఉండడంతో కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు యువతను మద్యం, మత్తు పదార్థాలకు బానిసలుగా చేసి జీవితాలు నాశనం చేస్తున్నారని రాష్ట్ర యువ నాయకులు వ్యాపారవేత్త బోడె రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు ఆయన ఆదివారం రోజున సోమల మండలం నెల్లిమంద గొల్లపల్లి, వడ్డిపల్లి, ఎగువపల్లి, నవాబుపేట, తమ్మినాయనపల్లి, కురవపల్లి, పగడాలవారిపల్లి, వల్లిగట్ల, తెట్టుపల్లి, బోయపల్లి గ్రామాల్లో పర్యటించగా ఆయనకు స్థానిక మహిళలు, రైతులు, యువత, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలకడం జరిగింది ఆయన ప్రజలతో మమేకముతో ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్న పుంగనూరు నియోజకవర్గంలో సమస్యలు తీర్చకపోగా లేని సమస్యలు సృష్టిస్తున్నారన్నారు రాష్ట్రంలోనే అత్యంత శక్తివంతమైన మంత్రిగా, కీలకంగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమస్యలు పరిష్కరించడంలో దారుణంగా విఫలం కావడం జరిగిందన్నారు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న అధికారులు మాత్రం వైసీపీ నాయకులకు అండగా నిలబడడం జరుగుతున్నదని సామాన్యులు ఇల్లు నిర్మాణాలు చేసుకోవడానికి ఎక్కడైనా కొంత ఇసుక తరలిస్తే వారిపై పిడియాక్ట్ కేసులు నమోదు చేసి ఇబ్బంది పెట్టడం జరుగుతున్నదన్నారు. గ్రామాల్లో ఒకరిద్దరూ వైసిపి నాయకులు యువతను చెడు అలవాట్లకు బానిస చేసి, ఇతర చట్ట వ్యతిరేక పనులకు వాడుకుంటూ వారి జీవితాలను నాశనం చేయడం జరుగుతున్నది అన్నారు పుంగనూరు నియోజకవర్గం ఏ ఒక్కరి సొత్తు కాదు , భయపెట్టడం, బెదిరింపులు, దౌర్జన్యాలు ఇక సాగవు. ప్రజలు, రైతులు,యువతకు తాను అండగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఎవరు అధైర్య పడనవసరం లేదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి ఇంటిని కలుస్తాను. మండల పర్యటనలో గొల్లపల్లి, నవాబుపేటలో అనారోగ్యం పాలైన ఇద్దరు వ్యక్తులకు, తెట్టుపల్లెలో ఇటీవల పిడుగుపాటుకు తండ్రి మృతి చెందడంతో పిల్లల చదువు కోసం రామచంద్ర యాదవ్ కొంత నగదు సాయం అందజేశారు కార్యక్రమంలో ఆర్సివై టీం నాయకులు నగేష్, సాంబమూర్తి, మాజీ ఎంపీటీసీ వల్లి సాహెబ్, లక్ష్మయ్య, చంద్ర, ఈశ్వర్, రెడ్డప్ప, ఆదినారాయణ, శేఖర్ , ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం 60 వేలు నష్టం

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని చెల్లి గాని పల్లి గ్రామంలో శనివారం రాత్రి పూరి గుడిసె అగ్నికి ఆహుతైన సంఘటన చోటు చేసుకుంది బాధితురాలు సరోజమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని చెల్లిగానిపల్లి పంచాయితీ ఎంపీపీ పాఠశాల లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటమనిషి గా పని చేసుకుంటూ మిగతా సమయంలో పూరి గుడిసె (కొట్టు) వేసుకుని అందులో టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగించే వారని శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పంటిం చారని స్థానికులు ఇచ్చిన సమాచారంతో గుడిసె వద్దకు వెళ్లి చూడగా అప్పటికే పూర్తిగా కాలిపోయిందని, దుకాణంలో ఉన్న వంట సామాగ్రి, పాత్రలు, టేబుల్లు, 10 వేల రూపాయల నగదు అగ్నికి ఆహుతి అయింది అన్నారు పూరి గుడిసె కాలిపోవడంతో సుమారు 60 వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు గుడిసెకు నిప్పంటించిన వారిని గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ కృష్ణయ్య తెలిపారు

టిడిపిని అధికారంలోకి తేవడమే లక్ష్యం

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: రాబోయే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా మనమంతా కలిసి పని చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు నాయుడు అన్నారు బెంగళూరు లోని సదాశివ ప్రెస్ క్లబ్ లో ఐటీ రంగం వారితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన సత్తా ఏమిటో జగన్ రెడ్డికి చూపించామని ఇదే ఉత్సాహంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా మనమంతా కలిసి పనిచేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని తిరిగి మన చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు ఈ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా యువత భవిష్యత్తు బాగుండాలన్న రైతన్నల కళ్ళలో ఆనందం చూడాలన్న తిరిగి టిడిపి అధికారంలోకి రావాలని ఆయన అన్నారు అదేవిధంగా ప్రజలు కూడా ఈ వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు ఆరు మండలాల కోఆర్డినేటర్లు ఐటీ ఉద్యోగులు కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ సండే పండుగ వేడుకలు

విశాలాంధ్ర-పలమనేరు :ఆదివారం ఉదయం5 గంటలకు పలమనేరుటౌన్ లోఉండు సిఎస్ ఐ చర్చ్ నందు ఏసుక్రీస్తు గుడ్ ఫ్రైడే రోజు సిలువ వేయబడి నాది. మరి తిరిగి మూడవరోజు పునరుద్దానుడై లేచిన దినాన్ని ఈస్టర్ సండే గా రోజు జరుపుకోవడం జరిగిందనారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సంఘ సభ్యులు పిల్లలు పాల్గొని ఈస్టర్ సండే పండుగను సంతోషంగా ఆరాధిస్తూ జరుపుకోవడం జరిగిందనారు.అనంతరం ప్రత్యేక ఏసుక్రీస్తు ప్రార్థనలు చేశారు.

రేపు తిరుపతిలో బ్రాహ్మణ సమాఖ్య సమావేశం

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:-తిరుపతి వరదరాజ నగర్ విశ్వం టాలెంట్ స్కూల్ లో సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ పురోహిత్ బ్రాహ్మణ సమాఖ్య చిత్తూరు జిల్లా విభాగం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు రాజశేఖర్ దీక్షితులు తెలిపారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - రామకుప్పం : ఈనెల 14 న శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకునేందుకు రామకుప్పం మండల తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్బు మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి తరలి రావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికే గడపగడపకు కార్యక్రమం

చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు

విశాలాంధ్ర - చిత్తూరు: సమస్యల పరిష్కారాని కె గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా నగరంలోని వినాయకపురంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా గత నాలుగు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల సంబంధించి కరపత్రాలను ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొందరు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు. నగరపాలక సంస్థ సిబ్బంది .వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కొత్త కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్ గా షన్మోహన్ సోమవారం బాధ్యతలను స్వీకరించనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ గా షన్మోహన్ ను నియమించగా, ఇక్కడ కలెక్టర్ గా ఉన్న హరి నారాయణను నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ గా నియమితులైన షన్మోహన్ సోమవారం బాధ్యత స్వీకరించి అనంతరం స్పందన కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

మాజీ సైనిక సంఘం ఫ్లాగ్ డే కార్యక్రమం

విశాలాంధ్ర-గంగవరం :పలమనేరు మాజీ సైనిక సంఘం వారు ఫ్లాగ్ డే సందర్భంగా విరాళాలు ఇచ్చినటువంటి పాఠశాల మరియు కళాశాలల యాజమాన్యాన్ని పలమనేరు మాజీ సైనిక సంఘం సభ్యులు జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించడం జరిగిందనారు. 90 వేల రూపాయలు పలమనేరు సంఘం తరపున విరాళం అందించారు. దానికి విజయశంకర్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాని మాజీ సైనికులు విజయవంతంగా జరిపారని మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు ఏ పయని తెలిపారు.

ఏపీ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులుగా పురుషోత్తం

విశాలాంధ్ర- చిత్తూరు: ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఆర్కే పురుషోత్తం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చిత్తూరు నగరంలో ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 13 మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా పురుషోత్తం, సీనియర్ ఉపాధ్యక్షులుగా బ్రహ్మాజీరావు, ఉపాధ్యక్షులుగా వెంకటరామయ్య నూర్జహాన్ ,జాయింట్ సెక్రెటరీలగా సుబ్బారావు, లక్ష్మి, ట్రెజరర్ గా శ్రీనివాసన్, ఈసీ మెంబర్లుగా ఝాన్సీ రాణి, రమ్య వేణుగోపాల్ రావు, సమర్థనాథరెడ్డి ,వెంకట్ రామ్, శివకుమార్ లను ఎన్నుకున్నారు.

జేపీ వెల్నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - రామకుప్పం :మండల కేంద్రంలో నేటి నుండి ప్రతి సోమవారం జేపీ వెల్నెస్ ఫౌండేషన్ అధినేత జయప్రకాష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు జయప్రకాష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే శాంతిపురం మండల కేంద్రంలో నిరంతర అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రతి రోజూ సుమారు 500 - 600మంది నిరుపేదలకు భోజనవసతి కల్పించడం జరుగింద న్నారు. శాంతిపురం మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం మొదలు పెట్టి త్వరలో వంద రోజులకు చేరుకుంటున్న సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అదే స్ఫూర్తితో రామకుప్పం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ సమీపంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ మహెూత్సవాలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీ చర్చిలో ఆదివారం పాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ మహెూత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు ప్రార్థనలు బోధనలు చేశారు. పాస్టర్ ధనరాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పునరుత్థానమును గురించి వివరంగా బోధించగా భక్తులందరూ దేవుని మహిమ పరిచారు. ఏసుక్రీస్తును నమ్ముకుంటే సంతోషం కలుగుతుందని అన్నారు. ఈ లోకంలో విడిచిన తర్వాత దేవుని రాజ్యము దొరుకుతుందని తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుశీల, టైటస్, రీనా, సర్పంచ్ నటరాజ, దేవళంపేట మాజీ ఎంపీటీసీ కోదండయ్య, చంగల్ రాయులు, మల్లికార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: వ్యవసాయానికి అంతరాయం లేకుండా 9 గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వాలని ట్రాన్స్ కో ఎస్పీ ఈ కృష్ణారెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం మంగళంపేట సబ్‌స్టేషన్ ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందజేస్తున్నామని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలో విద్యుత్ సరఫరాపై ట్రాన్స్ కో అధికారులతో సమీక్షించారు .ఎస్ఈ వెంట డిఈ విజయన్, ఏడిఈ నరేంద్ర,ఏ ఈ పురుషోత్తం, ట్రాన్స్ కో సిబ్బంది ఉన్నారు .

కోనంగిపల్లి లో జల్లికట్టు- పలువురికి గాయాలు

విశాలాంధ్ర- వెదురుకుప్పం: మండలం లోని కోనంగిపల్లి లో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు.జల్లికట్టు నిర్వహణ ముందస్తు ప్రచారం ఉండడంతో జిల్లాలో పలుప్రాంతాల నుంచి పశువులను తీసుకురావడం తో పాటు, పాల్గొనడానికి జనం భారీగా తరలివచ్చారు. దీంతో కోనంగిపల్లి గ్రామ పరిసరాలు జనసంద్రంగా మారింది.పశువుల కొమ్ములకు కట్టిన పట్టీలు,బహుమతులు కైవసం చేసుకునే క్రమంలో పశువులను నిలువరించే క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. అన్నదానం చేశారు.చెదురు ముదురు ఘటనల మినహా జల్లికట్టు ప్రశాంతంగా ముగిసింది.

ఐఎఫ్‌టియు అఖిలభారత మహాసభల

గోడపత్రిక విడుదల

విశాలాంధ్ర -చిత్తూరు: ఐఎఫ్‌టియు ఏడవ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గం రైతు కూలీలు పేదలంతా మహాసభలలో పాల్గొనాలని ఐ ఎఫ్ టి యు చిత్తూరు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం మహాసభల జయప్రదానికి ముద్రించిన గోడపత్రికలను చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నాయకులు విడుదల చేశారు.ఈ మహాసభలలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కోశాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ పని చేసే కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కనీస వేతన చట్టాన్ని తీర్మానం చేసినప్పటికీ చట్టాన్ని అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు .స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని రాజకీయ వేధింపు అరికట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దు బాయ్ ,గణపతి, దేవయాని,ఉదయ్ బాబు, భరత్ కుమార్, నిశాంతి ,సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: జగనన్నతోనే సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని కో ఆప్షన్ సభ్యులు సైపుల్లా, వైసీపీ నాయకులు విరుపాక్షి జయ చంద్రారెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం ఎల్లంకి వారి పల్లి పంచాయతి పోశం వారి పల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై సంతృప్తిగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు., ఇంటికి స్టిక్కర్లు అతికించి,సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయకన్వీనర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ వెంకటేష్, అమర్నాథ్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, తడకర జయచంద్రారెడ్డి, కేశవలురెడ్డి ,రాజమూర్తి ,రాజేంద్ర, కాలేషావల్లి , రూకేష్, ధనలక్ష్మి ,గుణశేఖర్ రెడ్డి, మునీంద్ర వాలంటీర్లు గోపి ,శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీకి తక్షణం పరిష్కారం చూపిన సర్పంచ్

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతి తుడుంవారిపల్లెలోని గ్రామస్తులు గానుగపెంట ధనంజయ సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్పందనలో అర్జీని విన్నవించారు. స్పందన అర్జీని దేవళంపేట ఇంజనీరింగ్ అసిస్టెంట్ శశి కుమార్ సర్పంచ్ ఉష నరసింహులు దృష్టికి తీసుకెళ్లగా అర్జీకి ప్రత్యేక చొరవ చూపి సీసీ రోడ్డు ఏర్పాటుకు మట్టి సర్పంచ్ జెసిబి సహాయంతో మట్టిని తోరడంతో గ్రామస్తులు అర్జిదారు గానుగపెంట ధనుంజయ సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ ఉషా నర్సింహులును గ్రామస్తులు, యువకులు అభినందించి, గ్రామ అభివృద్ధికి తోడ్పాటు కల్పిస్తున్న సర్పంచ్ కి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి ఎంపీ వెంకట మిథున్ రెడ్డికి మా నాయకులు హేమచంద్ర రెడ్డి కి రుణపడి ఉంటామని అన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

వైసీపీలో కష్టపడే వారికి గుర్తింపు:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వైసీపీలో నిజాయితీగా కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి, తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి చెప్పారు. తిరుపతి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడుగా నియమితులైన కాపీరెడ్డి డిలీబాబురెడ్డి, ఎస్టీ విభాగం అధ్యక్షుడుగా నియమితులైన దాస సుబ్రహ్మణ్యంకు ఆదివారం శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జగనన్న కోసం నిజాయితీగా పనిచేసే ప్రతి ఒక్కరికీ మంచి పదవులు ఆ దేవుడే ఇస్తాడన్నారు. గత 30ఏళ్లలో శ్రీకాళహస్తిలో జరగని అభివృద్ధిని జగనన్న ప్రభుత్వం వచ్చాక అనతికాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ మధ్యకాలంలో కొందరు సెల్ఫీ చాలెంజ్ అని చెప్పి ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసం ఫేక్ వీడియోలు పెడుతున్నారన్నారు. ఇది ప్రజలు నమ్మవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి జడ్పీటీసీ సుబ్బా రెడ్డి, తొట్టంబేడు మండల ఇంచార్జి వాసు నాయుడు, గుమ్మడి బాలకృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, రేణిగుంట జడ్పీటీసీ సంధ్య, తొట్టంబేడు మండల వైస్ ఎంపీపీ పెద్దాసరి గెరాట రెడ్డి, తొట్టంబేడు భాస్కర్, కోవి చంద్రయ్య నాయుడు, నంద, పసల సుమతి, చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎం గ్రేడ్-2ను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

-ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎనర్జీ సెక్రటరీలను గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి ఏకపాలనకు ఉత్తర్వులు ఇవ్వాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆ సంఘ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీవీ మంజునాథ్ మాట్లాడుతూ... జేఎల్ఎం గ్రేడ్-2 గ్రామ, వార్డు సచివాలయ, విద్యుత్ అధికారుల మధ్య నలిగి పోతూ తీవ్రమైనటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కింది స్థాయిలో ఎంపీడీవోలు బయోమెట్రిక్ ను ఆఫీస్ పనివేళలో ఖచ్చితంగా వేయాలని హుకుం జారీ చేయడమే కాకుండా కొన్నిచోట్ల తాము చెప్పిన పనినే చేయాలని కూడా ఆదేశిస్తున్నారని లేదంటే షోకాజ్ నోటీసులు కూడా ఇస్తున్నారన్నారు. విద్యుత్ అధికారులు తాము జీతాలు చెల్లిస్తున్నందున తాము చెప్పిన పనే చేయాలంటూ ఆదేశాలు ఇస్తున్నారన్నారు. ఇలా రెండు శాఖల మధ్య జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు పని ఒత్తిడితో నలిగిపోతున్నారన్నారు. ఫీల్డ్ లో ఎక్కడ ఏ సంఘటన జరిగినా జేఎల్ఎం గ్రేడ్-2 లని బాధ్యులుగా చేసి సస్పెండ్ ఆర్డర్ల ఇస్తూ బాధ్యులైనటువంటి వారికి మాత్రం మెమోలతో సరిపెట్టి జేఎల్ఎం గ్రేడ్ -2లను బలిపశులను చేస్తున్నారన్నారు. జేఎల్ఎం గ్రేడ్-2 లను విద్యుత్ సంస్థల పర్యవేక్షణలో కాకుండా గ్రామ,వార్డు సచివాలయ పర్యవేక్షణలో పనిచేసుకునేటందుకు ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు ఎలాగైతే 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారో అదేవిధంగా చెల్లించాలి అని వారు ఈ సందర్భంగా డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సుధీర్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్, రహీం. జిల్లా నాయకులు బిల్లు శ్రీనివాసులు, రాకేష్ వర్మ, అనిల్, గురవయ్య, హేమంత్, నవీన్, అశోక్ రాజు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేయండి

బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ జిల్లా కమిటి సభ్యుడు డాక్టర్ చంద్రప్ప

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : నియోజకవర్గ స్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేయండని బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ జిల్లా కమిటి సభ్యుడు డాక్టర్ చంద్రప్ప పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా, వెంకటగిరి పట్టణంలో బిజెపి కార్యాలయం నందు బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ శిక్షణ తరగతులు జరిగాయి. వెంకటగిరి అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంకు బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ రాష్ట్ర మెంబెర్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కునిగిరి నీలకంఠం ముఖ్యఅతిథిగా, బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ జిల్లా కమిటి సభ్యుడు డాక్టర్ చంద్రప్ప, మెంబెర్ అనూష రామకృష్ణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రశాంతి పాల్గొన్నారు. బూత్ స్వశక్తీ కరణ్ అభియాన్ జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ చంద్రప్ప వెంకటగిరి అసెంబ్లీ స్థాయి నాయకులకు పోలింగ్ బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి చేయవలసిన ప్రధాన అంశాలను జాతీయ పార్టీ, రాష్ట్ర పార్టీ సూచనల మేరకు బూత్ స్వశక్తికరన్ అభియాన్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మండల ఇన్చార్జిలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంవీఎల్ నాగేశ్వరరావుకు డాక్టరేట్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను (ఎన్ సీఆర్ సీ) వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు ఎంవీఎల్ నాగేశ్వరరావుకు ముంబైకు చెందిన యూరో విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును యూరో విశ్వ విద్యాలయం వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంవీఎల్ నాగేశ్వరరావు వినియోగదారుల హక్కులను పరిరక్షించడానికి జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్ సీఆర్ సీ) ఏర్పాటు చేశారన్నారు. ఎంవీఎల్ నాగేశ్వరరావు తొమ్మిదేళ్లుగా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో వినియోగదారులకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఎన్ సీఆర్ సీ ద్వారా వేలాది మంది వినియోగదారులకు న్యాయం చేశారన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషనులో ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 2వేలకు మందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. ఈ కమిషను ద్వారా వినియోగదారులకు సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం వారి హక్కుల గురించి వివరించడం అవరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ముంబై యూరో విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేసినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ డాక్టరేట్ తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు. అవార్డు అందజేసిన యూనివర్సిటీ సభ్యులకు, అవార్డు రావడానికి కృషిచేసిన ఎన్ సీ ఆర్ సీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా నాగేశ్వరరావుకు డాక్టరేట్ రావడం పట్ల జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను సభ్యులు ఆయనను అభినందించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరిగే పాదయాత్రలను జయప్రదం చేయండి:సిపిఐ,సిపిఎం

విశాలాంధ్ర-నాయుడుపేట: ఈనెల 14 నుండి దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆధునిక భారత నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రలను జయప్రదం చేయాలని ఆదివారం వామపక్ష నాయకులు నాయుడుపేటలో పిలుపునిచ్చారు. వామపక్ష నాయకులునాయుడుపేట సిఐటియు కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగించేలా రిజర్వేషన్లను సమూలంగా నాశనం చేసి దేశంలో మనువాద సంస్కృతిని భారత దేశ రాజ్యాంగంగా మార్చాలని కుటిల రాజనీతి ప్రదర్శిస్తోందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ఇలప నాగేంద్రబాబు సిఐటియు నాయుడుపేట మండల అధ్యక్ష కార్యదర్శులు చాపల వెంకటేశ్వర్లు శివకవి ముకుందా తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి కత్తితో హల్ చల్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ముత్యాల పేట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ప్రకాష్ అనే మతిస్థిమితం లేని వ్యక్తి కత్తితో హల్చల్ చేశాడు. దీంతో వ్యాపారస్తులు రోడ్డుపై ఉండే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రావడంతో ప్రకాష్ ఒక దుకాణంలోకి వెళ్లి దాక్కున్నాడు. పోలీసులు చాకచక్యంగా అతనిని పట్టుకొని స్టేషన్ కు తరలించారు. ఇతని బంధువులు వెంకటగిరిలో ఉన్నారని తెలియడంతో పోలీసులు వారికి సమాచారం అందించారు ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీ హటావో- భారత్ బచావో

సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపు

14 నుంచి సిపిఐ, సిపిఎం పాదయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఈనెల 14 నుండి సిపిఐ, సిపిఎం పాదయాత్రను జయప్రదం చేయాలని, బీజేపీ హటావో- భారత్ బచావో అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపు నిచ్చారు. ఆదివారం సిపిఐ కాళహస్తి నియోజకవర్గ సమావేశం జె.తులసిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రలో పరిపాలన చేస్తున్న నరేంద్ర మోడీ దేశాన్ని మనువాద సిద్ధాంతంలో నడపాలని, ఫ్యూడల్ వ్యవస్థ వైపుకి తీసుకుని పోతూ, దానికి అడ్డుగా ఉన్న రాజ్యాంగ రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసి పార్లమెంట్ కు సహితం జవాబు దారీ తనం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు చేయడం, వ్యతిరేకించిన వారిని వివిధ వర్గాల పై రాజ్యాంగ సంస్థలను ప్రయోగించి అణచివేతకు గురి చేస్తుందున్నారు. మోడి తన అనుయాయులకు అందలాలు ఎక్కించడం, ఆదాని అవినీతి పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడానికి బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తుంది అని ప్రశ్నించే వారిని, ఆక్షేపించే వారిని చట్టంలో వెతికి శిక్షలు వేయించడం, అప్రజాస్వామ్యంగా పార్లమెంటు సభ్యత్వం తొలగించడం లాటి చర్యలను డేగా ప్రభాకర్ తీవ్రంగా దుయ్యబట్టారు. దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారం వచ్చిన తరువాత నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, వంట గ్యాస్ ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు, రైల్వే, ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, అలాగే నాలుగు సంవత్సరాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల పైన దాడులు, మహిళలు పైన అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. కనుక ఇటువంటి విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా ఉభయ కమ్యూనిష్టు పార్టీలు ఈ నెల 14 అంబేద్కర్ జయంతి నాడు బీజేపీ హటావో, భారత్ బచ్చావో నినాదంతో స్దానిక ప్రజా సమస్యలు జోడించి ప్రచారం ఆందోళన కార్యక్రమం ప్రారంభించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ సిపిఐ, సిపియం పార్టీలు ఒకటి రెండు రోజుల్లో కూర్చుని జిల్లా ఫోగ్రామ్ పై చర్చించి కార్యాచరణను రూపొందించి పార్టీకి, ప్రజలకు తెలియ జేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతారి రాధాకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి శివకుమార్, గోపి, శీను, సంఘ సభ్యులు మనీ, టి.మల్లీ, రాజయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం:పులివర్తి నాని

నాయకులు,కార్యకర్తలే నా కుటుంబం -2024లో చంద్రగిరి కోట పై టిడిపి జెండాను ఎగురవేద్దాం

"మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని" కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని టిడిపి చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు,చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త పులివర్తి నాని చెప్పారు.తిరుపతి రూరల్ మండల పరిధిలోని రామానాయుడు కళ్యాణ మండపంలో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి సర్వసభ్య సమావేశం ఆదివారం పులివర్తి నాని అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పులివర్తి నాని మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేది తెలుగు దేశం పార్టీ అని చెప్పారు.పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.చంద్రగిరి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలే తన కుటుంబమని, అందరూ కలిసికట్టుగా 2024లో చంద్రగిరి కోట పై టిడిపి జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఈ నెల 12వతేదీ నుంచి "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని" కార్యక్రమం ప్రారంభమవుతుందని,సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి మీ ముందుకు వస్తున్నానని ఆయన తెలిపారు. ఇప్పుడు నాయకులు,కార్యకర్తలతో ఎలా ఉన్నానో అధికారంలోకి వచ్చినా అలాగే ఉంటానని చెప్పారు.నామినేటెడ్ పదవుల్లో కానీ,ఇతర పదవుల్లో కానీ నాభార్య, కుమారుడు,కోడలు జోక్యం ఉండదని, కేవలం ముఖ్యమైన కార్యక్రమాలు,ప్రచారాల్లో మాత్రమే పాల్గొంటారని తెలిపారు.పార్టీలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా పనిచేస్తానని చెప్పారు."మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.అందరూ కలిసికట్టుగా 2024 లో చంద్రగిరి కోటపై టిడిపి జెండా ఎగురవేద్దామని చెప్పారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పరసారత్నం,బీద రవిచంద్ర యాదవ్, టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, వేమూరి మధు,బిరుదాల భాస్కర్ రెడ్డి,తిరుమల రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు,గౌస్ భాషా, భాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అందరివాడు అంబేద్కర్

- ఆంధ్రప్రదేశ్ ఎస్సీకమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబేద్కరిస్టు కుడి చేతి సురేష్ బాబు వారి తల్లి కె.వెంకటమ్మ, సోదరి సునీత జ్ఞాపకార్థం శ్రీ కాళహస్తి మండలం చెర్లోపల్లి గ్రామంలో శనివారం భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని నిర్మించారు. ఈ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, సమతా సైనిక్ దళ్, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నీల్ యాత్ర శ్రీకాళహస్తి ఈస్ట్ పోలీస్ స్టేషన్, నంది సర్కిల్ నుంచి ప్రారంభమై బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి చెర్లోపల్లి వరకు సాగింది. చెర్లోపల్లి గ్రామంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ , బిజెపి జాతీయ కార్యదర్శి, అండమాన్ నికోబార్ ఇన్చార్జి, యూపీ కో ఇన్చార్జి, జీ.ఎం.ఆర్.పాలిటెక్నిక్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు వై.సత్య కుమార్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుడిచేతి సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మహా మేధావి, ఆర్థికవేత్త, రాజానితిజ్ఞుడు, న్యాయ శాస్త్ర కోవిదుడు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిలువెత్తు త్యాగానికి నిదర్శనమని అందుకే అంబేద్కర్ విగ్రహాలు ప్రపంచవ్యాప్తంగా వెలుస్తున్నాయన్నారు. బాల్యం నుంచే అంటరానితనాన్ని, ఒడిదుడుకులు ఎదుర్కొని మొక్కవుని దీక్షతో అనేక డిగ్రీలు సాధించిన ఘనత డిగ్రీలను సాధించాడని ఓటు అనే ఆయుధాన్ని మనకు కల్పించి బ్యాలెట్ బాక్స్ నుంచి రాజులను తయారు చేసే పద్ధతిని తీసుకొచ్చే ప్రజాస్వామ్యానికి పురుడు పోశారని మహిళా సాధికారిక సామాజిక సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లు లాంటి అనేక చట్టాలను తీసుకొచ్చారని వ్యవసాయ సాగు కోసం నీటి ప్రాజెక్టులను రైతు బాంధవుడు అయ్యాడని రిజర్వేషన్లను తెచ్చి కొట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపాడని, కార్మిక సంక్షేమం కోసం కార్మిక చట్టాలు తెచ్చి కష్టజీవులకు అండగా నిలిచారని, రిజర్వ్ బ్యాంక్ తీసుకొచ్చి అనేక ఆర్థిక సంస్కరణలు చేసి దేశ అభివృద్ధికి బాటలు వేసి ఆర్థికవేత్త గా ఇలా వారి దూర దృష్టికి బలమానం లేదని అందుకే అంబేద్కర్ అందరివాడ అయ్యాడన్నారు. అంబేద్కర్ ఉన్నతలో మాత రమాబాయి త్యాగం దాగి ఉన్నదని , ఒక్కొక్కరుగా బిడ్డలు కోల్పోతున్న జాతి జనుల కోసం వారి అహర్నిశలు కృషి యావత్ దళిత గిరిజన బడుగు బలహీన మైనారిటీ హృదయాల్లో చిరస్మృతిగా నిలిచిపోయిందని వారి స్ఫూర్తి చిహ్నంగా భవిష్యత్ తరాల ముందుకు పోవాలని కోరారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుటిల ప్రయత్నం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని నా వర్గ ప్రజలకు ఎప్పుడూ అన్యాయం జరిగినా వెంటనే స్పందించడానికి సిద్ధంగా ఉంటానని పోరాటమే మన ధ్యేయంగా ముందు అడుగేయాలని పిలుపునిచ్చారు.ఆత్మీయ విశిష్ట అతిథి జాతీయ బిజెపి కార్యదర్శి వై సత్య కుమార్ మాట్లాడుతూ శతాబ్దాలుగా సామాజికంగా ఆర్థికంగా, అంటరానితనంతో ఆవేదనకు ఆగ్రహానికి గురైన అంబేద్కర్ అస్పృశ్యతను అంతమొందించడానికి అనేక పోరాటాలు నిర్వహించి వైతాళికుడై, కులం వలన మనిషికి కలిగిన కీడును అంబేద్కర్ తన రచనలతో, ప్రసంగాలలోనూ నిశితంగా విమర్శలు చేసి కోట్లాదిమంది ప్రజలను భావితం చేసిన మహోన్న వ్యక్తి డా.బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. యావత్ భారత దేశ అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగ రచనలో ఆయన కృషి అత్యంత గొప్పదని కొనియాడారు. ఆ మహనీయుని స్మృతి చిహ్నంగా బిజెపి ప్రభుత్వం మహారాష్ట్రలో అత్యంత ఎత్తైన విగ్రహ నిర్మాణానికి పూనుకున్నదని తెలిపారు. ఎస్సీ ఎస్టీ యువత అభివృద్ధి కోసం బిజెపి ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొస్తున్నదన్నారు.

గూడూరుకు చేరిన వందే భారత్ రైలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రైల్వే జంక్షన్ కు వందేభారత్ రైలు శనివారం రాత్రి చేరుకుంది. వైసీపీ, బీజేపీ నాయకులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, పట్టణ యువకులు పెద్ద ఎత్తున రైల్వే స్టేషన్ కు చేరుకుని వందేభారత్ రైలుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ స్వదేశీ టెక్నాలజీతో తొలిసారిగా దేశంలో వేగవంతంగా పట్టాలపై పరుగులు తీసే రైలును తయారు చేసి ప్రయిణీకులకు అందించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛాంధ్ర ఛైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ మాట్లాడుతూ వందేభారత్ రైలు గూడూరు మీదుగా చెన్నై వెళుతుందన్నారు. భవిష్యత్తులో గూడూరులోనూ నిలిపేవిధంగా చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖను కోరారు. అనంతరం పచ్చ జెండా ఊపి రైలును ప్రారంభించారు. అంతకుముందు యువకులు వందేభారత్ రైలును చూసి సెల్ఫీలు తీసుకున్నారు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మల్లు విజయ్ కుమార్ రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షులు బాలకృష్ణం నాయుడు, గాలి ప్రకాష్ నాయుడు, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి తెలుగు బిడ్డ ఒకవీర సైనికుడిగా సిద్ధపడాలి: మాజీ మంత్రి పరసారత్నం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: ప్రతి తెలుగు బిడ్డ ఒకవీర సైనికుడిగా సిద్ధపడాలని, 2024 ఎన్నికలలో తెలుగుదేశం విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సర్వసభ్యసమావేశం తిరుపతి రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి అధ్యక్షతన తనపల్లి రోడ్డు లోని రామానాయుడు గార్డెన్స్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు.ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పరసారత్నం ప్రసంగిస్తూ చిత్తూరు పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు చంద్రగిరి నియోజక వర్గం ఇంచార్జ్ పులివర్తి నాని ఈ నెల 12వ తేదీ బుధవారం నుండి తిరుపతి రూరల్ మండలం మంగళం నుంచి మీ ఇంటి వద్దకే మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని ప్రకటించారు.సదరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల విజయం ప్రారంభం మాత్రమే నని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని రాబోవు ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు.బోగస్ ఓట్లు గుర్తింపులో కీలకంగా పనిచేయాలన్నారు. పులివర్తి నాని ఆవేశపరుడే కానీ అవినీతిపరుడు కాదని ప్రజా సంక్షేమం కోసం కార్యకర్తలను కాపాడుకోవడం కోసం దూకుడుగా వెళతాడే కానీ ద్రోహం చేసేవాడు కాదని కితాబుని ఇచ్చారు.మనలో మనకు కలహాలు కల్పించడానికి ప్రలోభాలకు గురి చేయటానికి స్థానిక శాసనసభ్యులు చెవిరెడ్డి ఆరితేరిన వాడిని ఇది గుర్తెరిగి నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా పనిచేయాలని కోరారు.

ఘనంగా మహావీర జైన్ వారోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి జిత్తు జ్యులర్స్ అధ్వర్యంలో మహావీర జైన్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా జైనుల ఆలయాలలో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆదివారం కొత్త వీధిలో జైనుల ఆలయంలో మార్వాడీలు మహావీర్ విగ్రహానికి వివిధ ధార్మిక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిత్తు జూలర్స్ అధినేత జితేంద్ర మాట్లాడుతూ మహావీర్ జయంతిలో భాగంగా మార్వాడీలు ఆయుర్ ఆరోగ్యాలతో ఉండాలని తన సోదరి సరితా అరు నెలలు తిని అరు నెలలు తినకుండా ఉప వాసం ఉన్నారన్నారు.అందులో భాగంగా నేడు తన సోదరిని దేవతగా భావించి ఊరేగింపు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపద్యంలో కొత్త వీధి నుండి తీర్థకట్ట వీధి, గాంధీ రోడ్డు, బజార్ వీధి మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్వాడిలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి విరాళం

విశాలాంధ్ర-దొరవారి సత్రం: నాయుడుపేట మండల పరిధిలోని విన్నమాల గ్రామంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయానికి విశ్రాంతి విద్యుత్ శాఖ అధికారి లింగారెడ్డి జయరామిరెడ్డి ఆయన కుమారులు భాను ప్రకాష్ రెడ్డి,జయప్రకాష్ రెడ్డిలు శనివారం లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు, ఆలయ కమిటీకి చెందిన వేణుంబాక లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో వెలసిన ఆరోగ్య శిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధికి లింగారెడ్డి కుటుంబ సభ్యులు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మానవాళి పాపాలకు తనను తాను త్యాగం చేసుకున్న ఏసుక్రీస్తు తిరిగి వచ్చిన రోజు ఈస్టర్ మండలంలోని పలు చర్చలలో ఆదివారం ఏసుక్రీస్తు పునరుత్థాన దినం వేడు కలను ఘనంగా జరుపుకున్నారు,క్రైస్తవులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో ఈస్టర్ ఒకటి. బైబిల్ నిబంధనల ప్రకారం, యేసుక్రీస్తును శిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజున సిలువ వేయబడి సమాధి చేసినారు మూడవరోజు ఆదివారం నాడు తిరిగి మృత్యుంజయుడై సమాధి నుండి లేచినదని క్రైస్తవ విశ్వాసుల ప్రగాఢ విశ్వాసంతో ఈస్టర్ వేడుకలు జరుపుకుంటారు. చర్చిలో ప్రార్థన చేసుకున్న అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేసి పలువురికి అన్నదానం చేస్తారు. తమ ఆత్మీయులకు పంపిణీ చేయటం ఈరోజు ఆచరించే ముఖ్య ఘట్టం. ఈ ఈస్టర్ పండుగలో సంఘ పెద్దలు విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంజంజి వినాయకునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: సంకట చతుర్దశిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన అంజంజి వినాయకునికి ఆదివారం ప్రత్యేకంగా హెూమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు నిర్వహించి... గణపతి హెూమాన్ని శాస్త్రోక్తం గా చేశారు. అనంతరం గణపతి అభిషేకాన్ని నిర్వహించి, స్వామివారికి విశిష్ట అలంకారం చేశారు. ధూప దీప నైవేద్యాలు నివేదించి పూర్ణ హారతులు సమర్పించారు. ఈ పూజల్లో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, దేవస్థానం ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, ఆలయ సర్వేక్షకులు నాగభూషణం, వేద పండితులు శ్రీవత్సవ, అర్చకులు అనిల్ శర్మ, పరిచారకులు రాకేష్ శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఈయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ తనిఖీదారు హరి యాదవ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షులు రమేష్, వరప్రసాద్, ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా యూనిట్ అధ్యక్షులు సి.చెంచురత్నం యాదవ్, సురేష్, శ్రీనివాసులు, రవిశంకర్ రెడ్డి, భాస్కర్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజరాజశ్రీ తిరుపతి 5వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

E.P.No.64/2018
Arbitration Case No.93/2015

శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ (లి) తిరుపతి బ్రాంచి-2 వారి తరపు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డరు } డిక్రీ హోల్డరు

V/s

డి.దస్తగిరి వగైరా ...రెస్పాండెంట్లు

వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా పై కనబరచిన డిక్రీ హోల్డరుకు రావలసిన బాకీని రాబట్టుకొనుటకు గాను రెస్పాండెంటు నెం.1కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టువారు తేది. 25.04.2023 బహిరంగ వేలము వేయుటకు నిశ్చయించినారు. కావున వేలము నందు పాల్గొనుటకు ఆసక్తిగల వ్యక్తులు సదరు కోర్టు నందు తేది. 25.04.2023న ఉదయం 10.30 గం॥ల నుండి 5.30 గం॥లలోగా హాజరై వేలములో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: తిరుపతి డి., పూర్వపు చిత్తూరు డి., శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ డి., రేణిగుంట సబ్ డి., రేణిగుంట మండలం, నెం. 20రు తూకివాకం గ్రామ లెక్కదాఖలా, తూకివాకం గ్రామ పంచాయతి వార్డు నెం.2, తూకివాకం హరిజనవాడ రెసిడెన్షియల్ ఏరియా సర్వే నెం.31/1లో ఎ.3-16 సెంట్లు భూమిని ప్లాట్లుగా విభజించిన దానిలో ప్లాటు నెం.28 రుకి హద్దులు కొలతలు వివరం **తూర్పు:** ప్లాటు నెం.29లోని జాగా, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** ప్లాటు నెం.22లోని జాగా, **దక్షిణం:** 33 అ॥ వెడల్పు గల రోడ్డు, ఈ మధ్య తూర్పు-పడమర ఉత్తరము వైపు 40 అ॥ లేక 12,200 మీటర్లు, తూర్పు -పడమర దక్షిణం వైపు 40 అ॥ లేక 12.200 మీటర్లు, ఉత్తర-దక్షిణం తూర్పు వైపున 37 అ॥ లేక 11.285 మీటర్లు మరియు ఉత్తర - దక్షిణం పడమర వైపు 32 అ॥ లేక 9.760 మీటర్లు, మార్పు 1380 చ॥అ॥ లేక 153.33 చ॥గ॥ గల ఖాళీ జాగా మాత్రం.

వేలము తేది. 25.04.2023

జి.వి. సుబ్బయ్య, బి.ఎ., బి.ఎల్
డిక్రీ హోల్డరు తరపు న్యాయవాది, తిరుపతి. సెల్: 9440202564